క్లుప్తంగా

వలిరెడ్డికి శుభాకాంక్షలు



వలిరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

చీపురుపల్లిరూరల్: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా నియమితులైన వలిరెడ్డి శ్రీనివాసులనాయుడుకు మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. చీపురుపల్లిలోని జెడ్పీటీసీ కార్యాలయంలో శనివారం కేక్‌కట్ చేసి, ఆయన్ని సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ మరింత బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. తనను పార్టీ జిల్లా కార్యదర్శిగా నియమించినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

పిడిశీలలో 'ఫ్యామిలీ డాక్టర్'



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: మండలంలోని పిడిశీల గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో శనివారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో 68 మందికి వైద్య సిబ్బంది వివిధ వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ రాధ, ఆరోగ్య కార్యకర్త నిర్మల, ఆశ కార్యకర్త లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



హ్యాండ్ బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ సుబ్రహ్మణ్యం

జామి: మండలంలోని చింతాడ గ్రామంలో మండలపరిషత్ నిధులతో రెండు హ్యాండ్ బోర్లు ఏర్పాటు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించామని సర్పంచ్ అప్పాన సుబ్రహ్మణ్యం తెలిపారు. హ్యాండ్ బోర్లను స్థానిక పెద్దలతో కలిసి శనివారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఉప సర్పంచ్ దాసరిముత్యాలు, గ్రామపెద్దలు ఎ.వెంకటమల్లునాయుడు, జె.ఈశ్వరరావు, రామారావు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

జామి: మండలంలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారిని వివిధ పుష్పాలు, తులసీ దళాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఏ.ఆర్.పేట గ్రామంలో పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

రూ.50.73 లక్షలతో ఇంటింట కుళాయిలు



భూమిపూజ చేస్తున్న మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వరరావు

మెరకముడిదాం: మండలంలోని చిన బంటుపల్లి గ్రామంలో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.50.73 లక్షలతో ఇంటింట కుళాయిల ఏర్పాటు పనులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్. పార్వతి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శనివారం భూమిపూజ చేశారు. మాజీ జెడ్పీటీసీ కోట్ల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కోట్ల మోతీలాల్‌నాయుడు, ఎంపీటీసీ పల్లి కృష్ణంనాయుడు మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సమృద్ధిగా రక్షిత తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇంటింట కుళాయిలను ఏర్పాటు చేస్తోందన్నారు.

సీఎం బహిరంగ సభ విజయవంతం

- ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అప్పలనరసయ్య కృతజ్ఞతలు



నాయకులతో కలిసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే అప్పలనర్సయ్య

దత్తిరాజేరు: సాలూరు నియోజకవర్గంలోని చినమేడపల్లి వద్ద గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం, దత్తిరాజేరు మండలం లోని మరడాం వద్ద శుక్రవారం నిర్వహించిన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ ఊహించిన దానికంటే విజయ వంతమైందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. ఎం.లింగాలవలసలో సర్పంచ్ మజ్జి రామలక్ష్మి నివాసం వద్ద వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను మెచ్చి, ఆయన్ని ఆశీర్వదించేందుకు ప్రజలు వేలాదిగా తరలివచ్చారన్నారు.సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయిందని, వేలాది మంది జనం బయటే ఉండిపోయారన్నారు. అన్ని వర్గాల ప్రజలూ సభకు హాజరై సీఎం జగన్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారని చెప్పారు. గిరిజన యూనివర్సిటీ ఈ ప్రాంతం అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. సభను విజయవంతం చేసిన ప్రజలకు, ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సహకారం అందించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుమల శ్రీను, వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులు ప్రభూజీరాజు పలు గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈఓ తనిఖీలు



ఉన్నత పాఠశాలలో విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

బొండపల్లి: మండలంలోని నెలివాడ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈఓ) బి.లింగేశ్వరరెడ్డి శనివారం తనిఖీలు నిర్వ హించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను వినియోగిస్తున్నదీ లేనిదీ ఉన్నత పాఠశాలలోని 8వ తరగతి విద్యార్థులను ఆరా తీశారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. ఉపాధ్యా యులకు డీఈఓ పలు సూచనలు చేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు.

పరామర్శ



జెడ్పీటీసీ ఆరోగ్య సమాచారం తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అప్పలనరసయ్య

దత్తిరాజేరు: జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి అనారోగ్యంతో తన కన్నవారి గ్రామం మర్రివలసలో ఇంటివద్దనే చికిత్స తీసుకుంటు న్నారు. ఆమెను ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య శనివారం పరామర్శించారు. అలాగే మండల జేసీఎస్ కన్వీనర్ మహ దేవ్ ఫణీంద్రుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడడంతో దత్తిరాజేరులో ఆయన నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి పరామర్శించారు. పార్టీ సీనియర్ కార్యకర్త శివాజీరాజు గురువారం సాయంత్రం రామచంద్రాపురంలో గుండెపోటుతో మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన వెంట మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

పనితీరు మెరుగుపరుచుకోకుంటే చర్యలు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

గుర్ల: గ్రామాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీఎస్‌లు పనితీరు మెరుగుపరుచుకోవాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు ఆదేశించారు. గుర్ల, తెట్టంగి పీహెచ్‌సీల పరిధిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు, వైద్య సిబ్బందితో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నా..వైద్యసిబ్బంది పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మెరుగుపరుచుకోకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారులు అచ్యుతకుమారి, సూర్యనారాయణ, సత్యవతి, గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి షర్మిళ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల సందర్శన



ఉపాధ్యాయుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట: మండలంలోని కృష్ణాపురం గ్రామ ప్రాథమిక పాఠశాలను ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు శనివారం సందర్శించారు. పాఠశాలలో సదుపాయాలు, మధ్యాహ్న భోజన వంటకాలను, విద్యార్థుల హాజరు రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. హెచ్ఎం సూరిబాబుకు పలుసూచనలు చేశారు. పాఠశాల పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆయన వెంట ఉన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్‌ను పర్యవేక్షిస్తున్న వంశీకృష్ణ

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి పట్టణంలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ఆదేశాల తో మేజర్ పంచాయతీ సిబ్బంది శనివారం ఫాగింగ్ చేపట్టారు. ప్రధాన రహదారితో పాటు అంబేడ్కర్ కాల నీ, రామాంజనేయ కాలనీ, అన్నపూర్ణ కాలనీ, రెసిడెన్సియల్ స్కూల్ పరిసరాల్లో ఫాగింగ్ చేశారు. ఎంపీ తనయుడు బెల్లాన వంశీకృష్ణ, మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, టెలికాం బోర్డు మెంబర్ ఇప్పిలి తిరుమల పర్యవేక్షించారు.

అర్చకుల క్వార్టర్స్ ప్రారంభం



క్వార్టర్స్‌ను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, దేవదాయశాఖ అధికారులు

చీపురుపల్లిరూరల్: చీపురుపల్లి కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆవరణలో నిర్మించిన అర్చకుల క్వార్టర్స్‌ను ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ టి.అన్నపూర్ణ, పర్యవేక్షకురాలు పి.వి.లక్ష్మి శనివారం ప్రారంభించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ,ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో మంజూరైన సీజీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో క్వార్టర్స్ నిర్మించామని చెప్పారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, ఆలయ కార్య నిర్వహణాధికారి జి.శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాశ్‌రావు, వైస్ చైర్మన్ సూరు వెంకటకుమారస్వామి, నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసులనాయుడు, బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, ఇప్పిలి తిరుమల పాల్గొన్నారు.

విద్యార్థినులకు నగదు ప్రోత్సాహం



విద్యార్థులకు నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు, కెనరా బ్యాంకు ప్రతినిధులు

లక్కవరపుకోట: మండలంలోని గంగుబూడి ఉన్నత పాఠశాలలో 5 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కులాలకు చెందిన ప్రతిభావంత విద్యార్థినులకు కెనరా విద్యాజ్యోతి పథకం పేరిట కెనరా బ్యాంకు నగదు ప్రోత్సాహకాలు అందజేసింది. విశాఖపట్నం కెనరా బ్యాంకు ఆర్ఎంఓ సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో 5,6,7 తరగతులు చదువుతున్న బుత్తల ప్రవళిక, పొట్నూరు ప్రవళిక, కాటపల్లి అఖిలకు రూ 2,500 చొప్పున, 8,9,10 తరగతులు చదువుతున్న కాట పల్లి లలిత, చిత్రాడ లక్ష్మీతులసి, సబ్బవరపు లక్ష్మీప్రసన్నకు రూ.5వేలు చొప్పున అందజేశారు. హెచ్ఎం శారదాదేవి, ఉపాధ్యాయులు జామి ఈశ్వరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ తాతబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి



వేపాడ: బల్లంకిలో గృహ లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ



బొండపల్లి: అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చలంనాయుడు

వేపాడ: ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి పి.ఎస్.వి.లక్ష్మీనారాయణ లబ్ధిదారులను కోరారు. హౌసింగ్ డే సందర్భంగా బల్లంకి గ్రామంలో పూర్తయిన ఇళ్ల నిర్మాణాలతో పాటు వివిధ దశల్లో ఉన్న వాటిని శనివారం ఆయన పరిశీలించారు.అనంతరం లబ్ధిదారుల తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిర్మాణాలు సకాలంలో పూర్తిచేస్తే తక్షణమే బిల్లులు చెల్లిస్తామన్నారు. ఇంకా నిర్మాణాలకు నిధు లు అవసరమైతే వెలుగు ద్వారా రుణం తీసుకోవచ్చని చెప్పారు. నిర్మాణాలకు సంబంధించి ఏమైనా సమస్యలుంటే తమదృష్టికి తీసుకురావాలని సూ చించారు. ఎంపీడీఓ కూర్మనాథ్ పట్నాయక్, తహసీల్దార్ ప్రసన్నకుమార్, వెలుగు, ఉపాధి అధికారులు శ్రీనివాసరావు, ఆదిలక్ష్మి, గృహనిర్మాణశాఖ అధికారులు, స్థానిక పెద్దలు నూకిరెడ్డి తాతా రావు, బొడ్డు శ్రీను పాల్గొన్నారు.

సామూహిక గృహప్రవేశాలకు సిద్ధం చేయాలి

బొండపల్లి: మండలంలోని జగనన్న లేఅవుట్లలో వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయించి, లబ్ధిదారులను సామూహిక గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఎంపీపీ చల్లా చలంనాయుడు అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల ప్రత్యేక అధికారి ఎస్.వి.కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులతో కలిసి శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఇంకా నిర్మాణాలు పూర్తికాని సచివాలయాలతో పాటు, హెల్త్‌వెల్‌నెస్ కేంద్రాలు, రైతు భరోసా కేంద్రాల భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్, ఏఓ డి.వెంకటరమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమాభారతి తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానంపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

కొత్తవలస: సర్వేంద్రియానం నయనం ప్రధానమని, మరణానంతరం నేత్రదానం చేయడం వల్ల ఇద్దరు అంధులకు కంటి చూపు ప్రసాదించిన వారవుతారని వియ్యంపేట పీహెచ్‌సీ ఆప్తాలమిక్ ఆఫీసర్ సీహెచ్.ఈశ్వరరావు అన్నారు. జాతీయ నేత్ర దాన పక్షోత్సవాల్లో భాగంగా వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రినాయుడు ఆధ్వర్యంలో స్థానిక బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జయశ్రీ నేతృత్వంతో నేత్రదానంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. నేత్రదానం మహాదానమని, నేత్ర దానం చేయండి-ఇద్దరు అంధులకి చూపునివ్వండి అంటూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులకు నేత్రదానంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఆరోగ్య సహాయకులు సత్యారావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

స్తంభించిన ట్రాఫిక్

బొండపల్లి: మండలంలోని నెలివాడ జంక్షన్ వద్ద రాజు చెరువు గట్టుపై నుంచి రెండు రోజుల క్రితం పొలంలోకి బోల్తా పడిన లారీని శనివారం క్రేన్ సహాయంతో బయటకు తీశారు. ఈ క్రమంలో జాతీయ రహదారి-26పై ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి పోయింది. అటు విజయనగరం వైపు వెళ్లే వాహనాలతో పాటు గజపతినగరం వైపు వచ్చే వాహనాలు రెండు వైపులా సుమారు అయిదు కిలోమీటర్ల మేర నిలిచి పోయాయి. గంటన్నర పాటు వాహనాలు నిలిచి పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పోలీసులు విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

108లో ప్రసవం



తల్లీబిడ్డకు సపర్యలు చేస్తున్న 108 సిబ్బంది

శృంగవరపుకోట: అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం గంగవరం గ్రామానికి చెందిన అర్జుపు సుకురమ్మ శనివారం తెల్లవారుజామున 108లో ప్రసవించారు. సుకురమ్మకు పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. ఆమెను 108 లో ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా ఎస్.కోట మండలంలోని రాజీపేట గ్రామ సమీపంలో ప్రసవించారు. అనంతరం తల్లీ,బిడ్డను ఎస్.కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నారని పైలట్ సత్యనారాయణమూర్తి, టెక్నీషియన్ సత్యారావు తెలిపారు.

ముగిసిన రామాలయ ప్రతిష్ఠోత్సవాలు



ఆలయంలో కొలువుదీరిన సీతారామలక్ష్మణుల విగ్రహాలు

శృంగవరపుకోట: మండలంలోని లచ్చనదొరపాలెంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కోదండ రామాల య ప్రతిష్ఠోత్సవాలు శనివారం సీతా,రామ,లక్ష్మణ విగ్రహాల ప్రతిష్ఠతో ముగిశాయి. చివరి రోజు ఉదయం 6 గంటల నుంచి అర్చన, యంత్రపూజ, రత్నన్యాసం, విగ్రహాప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ కార్యక్రమాలు చేసిన మీదట గోపూజ, కల న్యాసం అంగ న్యాసం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, వైస్ ఎంపీపీ పి.వెంకటరమణ, సర్పంచ్ డి.మీన, ఎంపీటీసీ లక్ష్మి, సాంబరాజు, బుగత వెంకటేశ్వరరావు, మురళీరాజు పూజల్లో పాల్గొన్నారు.

ఇంటింట సర్వే



వేపాడలో సర్వే నిర్వహిస్తున్న నోడల్ అధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: మండలంలోని వేపాడ, వల్లంపూడి, బల్లంకి గ్రామాల్లో ఓటర్ల జాబితాలో ఓటర్ల తొలగింపుపై మండల నోడల్ అధికారి లక్ష్మీనారాయణ, తహసీల్దార్ ప్రసన్నకుమార్ శనివారం ఇంటింట నిజనిర్ధారణ సర్వే చేశారు. మరణించిన వారితో పాటు వలస వెళ్లిన వారి ఓట్లు కాకుండా వేరే ఎవరి పేర్లు అయినా జాబితా నుంచి తొలగించారేమోనని పరిశీలించారు. వీఆర్‌ఓలు బాలభాస్కర్, కొండమ్మ, పంచాయతీ కార్యదర్శి గౌరీ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించరూ...



తిమిడి గ్రామంలోని చిన్నవీధిలో నిలిచిపోయిన మురుగునీరు

శృంగవరపుకోట: మండలంలోని తిమిడి గ్రామంలో చిన్నవీధిలో మురుగు నీరు రోడ్డుమీదే నిలిచి పోతుండడంతో ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. వీధిలో మురుగునీరు మట్టి కాలువ ద్వారా ఇదివరకు వీధి చివర ఓ స్థలంలోకి విడిచిపెట్టువారు. అయితే మురుగునీరు నిలిచిన స్థలానికి సంబంధించిన యజమానులు తమ స్థలంలోకి మురుగునీరు విడిచి పెట్టవద్దని 2022 మే నెలలో మట్టి కాలువను కప్పేశారు. గ్రామపెద్దలు స్థల యజమానులతో మాట్లాడి, సీసీ కాలువలు నిర్మించి, శాశ్వత పరిష్కారం చూపే వరకు మురుగునీరు ప్రైవేటు స్థలంలోకి విడిచిపెట్టేందుకు అవకాశం ఇవ్వాలని కోరడంతో సంబంధిత యజమానులు అంగీకరించారు. అయితే నేటికీ కాలువ నిర్మించకపోవడంతో ఈనెల 21న సదరు స్థలం యజమానులు మళ్లీ కాలువ కప్పేయడంతో వీధిలో మురుగునీరు ఇళ్ల ముందు నిలిచిపోయింది.అధికారులు స్పందించి తమసమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పాడిరైతులు అప్రమత్తంగా ఉండాలి



పశువులకు వైద్యం చేస్తున్న వైద్యాధికారి గాయత్రీదేవి

లక్కవరపుకోట: వర్షా కాలంలో పశువులకు వ్యాధులు సోకే అవకాశం ఎక్కువని, పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎల్.కోట పశువైద్యాకారి కె.గాయత్రీదేవి సూచించారు. మండలంలోని మార్లాపల్లి గ్రామంలో శనివారం పశువైద్య శిబిరం నిర్వహించారు. 45 పశువులకు చూడిద తనిఖీలు చేశారు. అలాగే ఎదకు రాని పశువులు, తిరిగి పొర్లుతున్న పశువులకు వైద్యం చేశారు. కృత్రిమ గర్భధారణ ఇంజెక్షన్లు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు జబువు, డెక్కవాపు తదితర వ్యాధులు సోకే అవకాశం ఉందని అన్నారు.పశువులను పొడి ప్రదేశంలో ఉంచాలని చెప్పారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా పశుగ్రాసం పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, పాడి రైతులు సద్వినియోగించుకోవాలని సూచించారు. పశుపోషణలో జాగ్రత్తలను వివరించారు.

సమస్యలకు తక్షణ పరిష్కారం

వేపాడ: 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో అందిన ఫిర్యాదులను పరిశీలించి, ప్రజల సమస్యలకు త్వరగా పరిష్కారం చూపేలా అధికారులు చొరవ చూపాలని మండల ప్రత్యేక అధికారి పి.ఎస్.వి. లక్ష్మీనారాయణ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. 'జగనన్నకు చెబుదాం'లో వచ్చిన ఫిర్యాదులపై శాఖల వారీగా ఆరా తీశారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. తక్కువ బరువు ఉన్న చిన్నారులు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం సక్రమంగా అందేలా చూడాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్లకు సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తుగా తీసుకుంటున్న చర్యలపై ఆరోగ్యశాఖాధికారులను ఆరా తీశారు. రెవెన్యూ ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్,ఐకేపీ, ఉపాధి తదితర శాఖలపై సమీక్షించారు. తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ బి.ఎస్.ఎన్ కూర్మనాథ్‌పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.